నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 8 జనవరి 2025 | KHAMMAM

# ఎన్నిక ఏదైనా విజయం బీఆర్ఎస్‌దే..

- రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కేసీఆర్ పాలనే..
- పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు


సమావేశంలో మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

మధిర, జనవరి 7 : రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా మళ్లీ గెలిచేది బీఆర్ఎస్ పార్టీయేనని జడ్పీ మాజీ చైర్మన్, పార్టీ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. మధిరలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎర్రుపాలెం మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది దాటినా కాంగ్రెస్ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ పదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేశారని, మళ్లీ వచ్చేది కేసీఆర్ పాలనే అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు పార్టీ జెండాను మోసేందుకే ఉన్నారని, పార్టీని మోసం చేసేందుకు లేరన్నారు. పార్టీ బలోపేతం కోసం సమష్టిగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని కోరారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకునేలా కలిసికట్టుగా పని చేయాలన్నారు. మాజీ జడ్పీటీసీ శీలం కవిత మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పార్టీ పిలుపు మేరకు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యరమల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, షేక్ మస్తాన్‌వలీ, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కరోనా** ఎందరినో కాటేసింది.. తల్లిదండ్రులను తుదముట్టించి బిడ్డలను అనాథలను చేసింది.. వయో భేదం.. ఆర్థిక తారతమ్యాలు లేకుండా ప్రతి ఒక్కరికీ కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఆ మహమ్మారి కల్పించిన భయోత్పాతం నుంచి జనం ఇప్పుడిప్పుడే బయటపడుతున్నరు.. తాజాగా..! అచ్చం అలాంటిదే మరో ముప్పు పొంచి ఉందా..? ప్రాణాంతక వైరస్ పరుగెడుతూ మనదాకా వస్తోందా..? అలనాటి చేదు విషపు వలయాన్ని విసరనుందా..? అవునో.. కాదో.. తెలియదు కానీ..! సరిహద్దులు దాటుకుంటూ మన దేశంలో అడుగుపెట్టింది.. తెలంగాణ పొరుగునే ఉన్న బెంగళూరులో ప్రత్యక్షమయ్యింది.. ఓ చిన్నారి ఆరోగ్యాన్ని కబళించేందుకు సమాయత్తమైంది.. పిడుగులాంటి ఈ సమాచారం వెల్లడికావడంతో సబ్బండవర్గాలు ఆందోళనలో మునిగాయి. ఇంతకూ ఏమిటా వైరస్..? అధికారులు ఏం చెబుతున్నరు..? మనమేం చేయాలి అనే అంశాలపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న కథనం.

*- ఖమ్మం, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- బెంగళూరులో చిన్నారికి హెచ్ఎంపీవీ
- ఖమ్మంలో అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ
- జాగ్రత్తలు పాటించాలంటూ ప్రచారానికి సిద్ధం
- మరోసారి భయాందోళనకు గురవుతున్న జనం
- 'ప్రైవేట్' దోపిడీకి అడ్డుకట్ట వేయాలని విన్నపాలు







# వైరస్ వస్తోంది..!




చైనాలో మరో వైరస్ వెలుగులోకి వచ్చింది. వైద్య పరిభాషలో దానిపేరు హ్యూమన్ మెటాన్యూమోవైరస్(హెచ్ఎంపీవీ) అని అంటున్నరు. కరోనాకు సరిసమానమైనదిగా చెబుతున్న ఈ మహమ్మారి ఆ దేశ సరిహద్దులను దాటుకుంటూ మనదాకా వస్తోంది. సోమవారం గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో కేసులు నమోదుకావడం, వివిధ ప్రసార మాధ్యమాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ప్రచారం వ్యాప్తిచెందడంతో ప్రజల్లో అలజడి రేగుతోంది. ప్రధానంగా తెలంగాణకు పొరుగునే ఉన్న బెంగళూరులో ఓ చిన్నారికి హెచ్ఎంపీవీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని, వైరస్ కచ్చితంగా రాష్ట్రమంతటా వ్యాపించడానికి ఎక్కువ రోజులు పట్టదని వైద్య నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. గత 2019 డిసెంబర్, జనవరి నెలల్లో కరోనా విషయంలో మొదట హెచ్చరించినప్పటికీ వ్యాధి తీవ్రత పెరిగే వరకూ ఏ ఒక్కరూ విశ్వసించలేదని, ఇప్పుడా అలసత్వం వద్దని సూచిస్తున్నారు. ఎవరికివారు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ వైరస్ నుంచి ప్రాణాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందంటున్నారు.

### హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు..!

హ్యూమన్ మెటాన్యూమోవైరస్ అచ్చం కరోనా లాంటిదేనని వైద్యవర్గాలు అంటున్నాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుందని, సోకిన మూడు రోజుల్లోనే శరీరంలోని రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తుందని, అధికంగా జ్వరం రావడం, దగ్గులు, తుమ్ములు, శరీరంపై దద్దుర్లు, ఒళ్లు నొప్పులు, గ్యాస్ట్రో సమస్యలు దీని లక్షణాలుగా పేర్కొంటున్నారు. న్యూమోనియా పెరిగి ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ప్రస్తుతం కోల్డ్ సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో వైరస్ పదిహేనేండ్లలోపు పిల్లలు, వయో వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉంది. హెచ్ఎంపీవీ విషయంలో తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన ఆవశ్యకత ఉంది. ఇంట్లో పిల్లలకు జ్వరం లేదా జలుబు చేసినట్లయితే ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలలకు పంపవద్దు. అదేవిధంగా విహారయాత్రలు, ఫంక్షన్స్, ఇతర సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉంచాలి. వైద్యులు సూచించిన సలహాలు పాటిస్తూ, మందులు వాడుతూ సొంతంగా కొన్ని స్వీయరక్షణ చర్యలు పాటించాలి. కరోనా కాలంలో మాదిరి ముఖానికి మాస్కులు ధరించాలి. తినే ముందు చేతులను శానిటైజర్‌తో శుభ్రంగా కడుక్కోవాలి. రోజువారీగా మంచి పోషకాహారం పెడుతూనే నిమ్మరసం విధిగా తాగించాలి. ఎండలో కూర్చోబెట్టాలి. గోరువెచ్చని నీటిలో కాసింత ఉప్పును కలిపి ముక్కులో నుంచి వచ్చేలా శుభ్రం చేయించాలి. రాత్రి పడుకునే సమయంలోనూ మూడు, నాలుగు దఫాలు ఉప్పు నీటితో నోటిని పుక్కిలించి ఉమ్మేయాలి.

### అప్రమత్తమైన అధికార యంత్రాంగం..

కరోనా మహమ్మారిని తలపించే హెచ్ఎంపీవీ వైరస్ దేశంలోకి ప్రవేశించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశానుసారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు సమాయత్తమయ్యారు. తమ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యులు, సూపర్‌వైజర్లు, నర్సింగ్, ఆశాలను అప్రమత్తం చేశారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి పదిహేనేండ్లలోపు చిన్నారుల ఆరోగ్య వివరాలను సేకరించాలని ఆదేశించారు. సమీప పాఠశాలలకు వెళ్లి స్థానిక ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. బెంగళూరు వరకు వచ్చిన వైరస్ ఖమ్మానికి వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అందించాల్సిన వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. కాగా..! కరోనా మహమ్మారిని ప్రత్యక్షంగా ఎదుర్కొని అష్టకష్టాలు పడిన జిల్లా ప్రజలు మరో వేరియంట్ అనగానే వణికిపోతున్నరు. నాడు వేలల్లో కేసులు, వందల్లో మరణాలను పక్కనబెడితే వైరస్ బారిన పడి కోలుకున్న వారు సర్వం కోల్పోయారు. వాటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ప్రైవేట్ ఆసుపత్రుల్లో దోపిడీకి ఆస్కారం లేకుండా ముందస్తుగా కఠిన నిబంధనలు విధించాలని సామాన్య జనం కోరుతున్నారు.

### ఈ లక్షణాలు కనిపిస్తే ఇలా చేయాలి

- దగ్గు లేదా తుమ్ము సమయంలో నోరు, ముక్కును రుమాలు లేదా టిష్యూ పేపరుతో కప్పుకోవాలి.
- సబ్బు, నీరు, ఆల్కహాల్ -ఆధారిత శానిటైజర్‌తో తరచుగా చేతులను శుభ్రం చేసుకోవాలి.
- గుంపులతో కూడిన ప్రదేశాలకు వెళ్లకూడదు. ఫ్లూ ప్రభావిత వ్యక్తులకు దూరంగా నిలబడాలి.
- జ్వరం, జలుబు, దగ్గు ఉన్నట్లయితే ప్రజా ప్రదేశాలకు దూరంగా ఉండాలి.
- ఎక్కువగా నీరు తాగాలి. పోషకాహారం తీసుకోవాలి.
- వ్యాధి వ్యాప్తి తగ్గించడానికి బాగా గాలి చొరబడే ప్రదేశాల్లో ఉండటం మంచిది.
- అనారోగ్యంగా ఉంటే ఇతరులతో కలవకుండా ఇంట్లోనే ఉండాలి.
- కంటినిండా నిద్రపోవడం అత్యవసరం.

### ఇలాంటి పనులు చేయకూడదు..

- ఎదుటి వారితో కరచాలనం చేయకూడదు.
- రుమాలు, టిష్యూ పేపర్‌ను తిరిగి వాడొద్దు.
- అనారోగ్యం కలిగిన వ్యక్తులతో సమీప సంబంధం కలిగి ఉండకూడదు.
- కండ్లు, ముక్కు, నోరు వంటి భాగాలను తరచుగా తాకవద్దు.
- బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మకూడదు.
- వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వాడకూడదు.

### స్వీయ జాగ్రత్తలే మేలు..



హెచ్ఎంపీవీ వైరస్ తెలంగాణలోకి రాలేదు. ఒకవేళ వచ్చినప్పటికీ ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. వైరస్ పిల్లలతోపాటు వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపించనున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ స్వీయ జాగ్రత్తలు పాటిస్తేనే మేలు. ప్రధానంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. జ్వరం, జలుబు లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ వహించకుండా సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలి. మూడురోజులైనా తగ్గకపోతే వైద్యుల పర్యవేక్షణలో ఉంచి సేవలు అందేలా చూడాలి. ఈ వైరస్ గురించి ఏ ఒక్కరూ భయపడాల్సిన అవసరం లేదు. **– డాక్టర్ కళావతిబాయి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి**

# మిర్చి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు

## అధికారులతో సమీక్షలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి

మామిళ్లగూడెం, జనవరి 7 : మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మిర్చి సీజన్ కార్యకలాపాలు, హోంగార్డ్స్ కేటాయింపు, మిర్చి రేటు హెచ్చు తగ్గులు, ఫైరింజన్ ఏర్పాటు, యార్డులో సౌకర్యాలు తదితర అంశాలపై మిర్చి ట్రేడర్లు, కోల్డ్ స్టోరేజీ యాజమాన్యం, పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రైతులు 59 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారని, లక్షా 18 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చనే అంచనా ఉందన్నారు. మిర్చి యార్డుకు ఖమ్మం జిల్లాతోపాటు సూర్యాపేట, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల నుంచి పంట విక్రయానికి వచ్చే అవకాశం ఉందన్నారు. పంట విక్రయానికి తీసుకొచ్చే రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, యార్డులో సీసీ కెమెరాలు, టాయిలెట్స్, బయోమెట్రిక్ సిస్టం, మిర్చి గ్రేడింగ్ యంత్రాల వంటి వసతులు కల్పించాలని ఆదేశించారు. మిర్చి సీజన్‌లో మరో 20 మంది అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని, భద్రత కోసం 20 మంది హోంగార్డులను కేటాయించాలని సూచించారు. మార్కెట్‌లో అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని, పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ.అలీం, ఏసీపీ యూఎస్.రాజు, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ షఫీవుల్లా, అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


అధికారులతో మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, జనవరి 7 : వివిధ విభాగాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, లేదంటే శాఖాపరమైన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో రాహుల్ హెచ్చరించారు. భద్రాచలం ఐటీడీఏలోని పలు విభాగాలను మంగళవారం పరిశీలించిన ఆయన ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడం కోసం ప్రభుత్వం ఐటీడీఏలను నెలకొల్పిందని, వారికి అవసరమైన పనులు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇందుకోసం అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలన్నారు. పనులను అశ్రద్ధ చేయొద్దని, ఏ విభాగానికి ఆ విభాగాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ విభాగాలను సందర్శిస్తున్న క్రమంలో ఏ అధికారి ఏయే పనులు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే గిరిజనులు ఇచ్చిన దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, వారి పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కోసం బారులు

## సాగుకు సరిపోయే విధంగా సరఫరా చేయాలని చింతకాని రైతుల డిమాండ్


చింతకాని సహకార సంఘం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

మధిర (చింతకాని), జనవరి 7 : మొక్కజొన్న సాగు రైతులు యూరియా కోసం నానా పాట్లు పడుతున్నారు. ఏపుగా వస్తున్న పంటకు ఎరువు అవసరం కావడంతో అందుబాటులో లేక ఆందోళన చెందుతున్నారు. యూరియా బస్తాల కోసం చింతకాని పీఏసీఎస్ ఎదుట మంగళవారం తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. వివరాలు ఇలా ఉన్నాయి. చింతకాని ప్రాథమిక సహకార సంఘం(పీఏసీఎస్) పరిధిలో 17 గ్రామాల రైతులు ఉన్నారు. వీరు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కాల్వ కింద సుమారు 15 వేల ఎకరాల్లో యాసంగిలో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతానికి ఏపుగా వస్తున్న పంటకు యూరియా అవసరం ఉంది. దీంతో సహకార సంఘాల ద్వారా యూరియా విక్రయిస్తుండడం.. అదీ అరకొరగా రావడంతో పురుషులతోపాటు మహిళా రైతులు కూడా ఉదయం నుంచే యూరియా కోసం బారులు తీరారు. సాగుకు సరిపోయే విధంగా యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వెంటనే పూర్తిస్థాయిలో యూరియాను సరఫరా చేయాలని, ఇందుకోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

## ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జనవరి 7 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు భద్రాద్రి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీల ధర్నాకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాల పెంపు హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం నిధులు అధికంగా కేటాయించాలని, పక్కా భవనాలు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య, గోనె మణి, అరుణ, భూక్యా లలిత, మల్లికార్జున్, బండి నాగేశ్వరరావు, అన్నవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కళ్లకు నల్ల రిబ్బన్‌తో నిరసన

## దమ్మపేట, భద్రాచలం, ఇల్లెందులో ఆరో రోజుకు చేరిన జీసీసీ హమాలీల సమ్మె

దమ్మపేట/భద్రాచలం/ఇల్లెందు, జనవరి 7 : మూడు నెలల క్రితం చర్చల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దమ్మపేట, భద్రాచలం, ఇల్లెందు జీసీసీ కార్యాలయాల ఎదుట జీసీసీ హమాలీలు రోజుకో విధంగా నిరసన తెలుపుతున్నారు. వీరికి పలు సంఘాలు మద్దతు పలుకుతున్నాయి. దమ్మపేట సమ్మె శిబిరంలో జీసీసీ హమాలీ కార్మికులు మంగళవారం కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. శిబిరాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేశ్ దొర ప్రారంభించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నదని, వేతన ఒప్పందం ప్రకారం రెండేళ్లకొసారి రేట్లు పెంచాలని, పీఎఫ్ సౌకర్యం, పనిభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. భద్రాచలంలో సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా నాయకులు ఎంబీ నర్సారెడ్డి, కొలగాని రమేశ్‌లు ప్రారంభించి మాట్లాడారు. మూడు నెలల క్రితం రేట్ల ఒప్పందం జరిగినప్పటికీ ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో అనివార్య పరిస్థితుల్లో హమాలీలు సమ్మెకు దిగారన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇల్లెందు గిరిజన సహకార సంఘం(జీసీసీ) గిడ్డంగి–1 ఎదుట హమాలీ సంఘం అధ్యక్షుడు బంధం నాగయ్య ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో హమాలీ మేస్త్రీ బోగి సత్యం, కార్మికులు బోగి నర్సింహారావు, మణికంఠ, శ్రీను, రాజు, ప్రసాద్, చెన్నారావు, స్వామి, సీఐటీయూ నాయకులు నాగరాజు, అజయ్‌కుమార్, మురళీకృష్ణ, హమాలీ నాయకులు ప్రసాద్, శేషు, లోకేశ్, ముత్తయ్య, సదానందం, వీరన్న, గాంధీ, మధు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.



దమ్మపేటలో కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలుపుతున్న జీసీసీ కార్మికులు


భద్రాచలంలో సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సీఐటీయూ నాయకులు


ఇల్లెందు జీసీసీ గిడ్డంగి ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు, హమాలీలు